క్లుప్తంగా

రేపు నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్‌అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలో బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ విద్యాభారతి హైస్కూల్, పటాన్‌చెరు మండలం పాశమైలారం ఐటీడబ్ల్యూ ఇండియా లిమిటెడ్, పటాన్‌చెరు మండలం రుద్రారం ఎంఎస్ఎన్ లాబరేటరీలో శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బహుశానిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

17 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 17మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మంది వాహనదారులను అదుపులో తీసుకొని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. దీంతో జడ్జి 15 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా, ఒకరికి రూ.3 వేలు, మరో వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

బీఫామ్ అందజేతపై సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీతాలక్ష్మారెడ్డికి సీఎం కేసీఆర్ బీఫామ్ ఇవ్వడంతో హత్నూరలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు శివశంకర్‌రావు, నాయకులు గొల్ల యాదయ్య, ఆకుల నరేందర్, ఆకుల మల్లేష్, ఎనగండ్ల నర్సింహులు, యాదగిరి, నల్లోళ్ల ఎల్లయ్య, పొట్లగళ్ల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



ప్రభుదాస్

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసింది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భీమ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రభుదాస్(35) బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న ప్రభుదాస్ తన కుమారుడితో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో భార్య మోరిదేవి ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అదృశ్యంపై భార్య మేరీదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ మృతి



రవీందర్ (ఫైల్)

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం డిప్యూటీ ఈఈ ఎర్ర రవీందర్ (58) అనారోగ్యంతో మృతి చెందారు. వరంగల్‌కు చెందిన ఈయన ఏడాదికాలంగా ఇక్కడ డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్నారు. ఆయన భార్య, కుమారుడు వరంగల్‌లో నివసిస్తుండగా రవీందర్ ఖేడ్‌లోని అద్దె ఇంట్లో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం బాగాలేదని కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం సాయంత్రం వచ్చి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా రాత్రి మార్గమధ్యలో మృతిచెందారు. పార్థీవదేహాన్ని వరంగల్‌కు తరలించగా బుధవారం అక్కడ నిర్వహించే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఇక్కడి నుంచి ఆ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది బయలుదేరివెళ్లారు.

ఆశీర్వాదసభను విజయవంతం చేయండి

జోగిపేట (అందోల్): ఈ నెల 29న జోగిపేట పట్టణంలో నిర్వహించే దళితుల ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎంపీపీ జోగు బాలయ్య అన్నారు. జోగిపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం దళిత ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు దళితులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. మాజీ సర్పంచ్ శంకరయ్య, దళిత నాయకులు మొగులయ్య, గోపాల్, దేవయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా?

అంగట్లో అన్ని ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉందన్నట్లు ఉంది అధికారులు తీరు.. పారిశ్రామికవాడల్లోని వివిధ పరిశ్రమల్లో చోటుచేసుకునే అగ్నిప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం రెండెకరాల స్థలాన్ని కేటాయించింది. కానీ.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విలువైన స్థలంపై కన్నేసిన కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– జిన్నారం(పటాన్‌చెరు)

- తరచూ చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు
- పారిశ్రామికవాడల్లో ఫైర్‌స్టేషన్ లేక ఇబ్బందులు
- స్థలం కేటాయించినా నేటికీ చేపట్టని పనులు
- ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పరిశ్రమల యజమానుల విన్నపం



పరిశ్రమలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

జిన్నారం మండల పరిధిలోని బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం, గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో 200పైగా వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 80శాతం రసాయన పరిశ్రమలు ఉన్నాయి. రసాయన పరిశ్రమల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఈ క్రమంలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో అందుబాటులో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో కూకట్‌పల్లి, పటాన్‌చెరు, నర్సాపూర్, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల ప్రాంతాల నుంచి మంటలను ఆర్పేందుకు ఫైర్‌ఇంజన్ వాహనాలు వస్తున్నాయి. ఈ వాహనాలు ఘటనా స్థలానికి చేరుకునేందుకు గంటకుపైగా సమయం పడుతోంది. దీంతో వాహనాలు వచ్చేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

విలువైన స్థలంపై కబ్జారాయుళ్ల కన్ను..

బొల్లారంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం రెండెకరాల స్థలాన్ని కేటాయించింది. కానీ.. ఇప్పటివరకు ఫైర్‌స్టేషన్‌కు నిర్మాణ పనులను చేపట్టలేదు. దీంతో ఈ స్థలంపై కబ్జారాయుళ్ల కన్నుపడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు..

ఫైర్‌స్టేషన్ అందుబాటులో లేకపోవడంతో నిత్యం ఏదో ఒకచోట అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటునే ఉంటున్నాయి. ఏడాదిలో ఆయా పరిశ్రమల్లో ఇప్పటివరకు 30వరకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతోమంది కార్మికులు మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. భారీగా ఆస్తినష్టం కూడా జరగడంతో పారిశ్రామికవాడల్లో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా పరిశ్రమల యాజమన్యాలు, కార్మికులు కోరుతున్నారు.

నివేదికలు పంపాం

బొల్లారంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు గాను ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలను పంపాం. పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో వాటిని నివారించేందుకు తక్షణమే స్పందిస్తున్నాం. ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– జామియా, అగ్నిమాపక కేంద్రం అధికారి, పటాన్‌చెరు



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

పటాన్‌చెరు: సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలు తయారు చేయడమే తప్ప చేసేదేమీలేదని ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పదేళ్ల కాలంలో రూ.9వేల కోట్ల వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించి సేవచేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు. అనంతరం జిన్నారం మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వైస్‌ఎంపీపీ గంగు రమేష్, ఖజిపల్లి ఎంపీటీసీ ఆకుల భార్గవ్, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ ఓం ప్రకాష్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, కార్పొరేటర్లు, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై విచారణ చేపట్టండి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై విచారణ చేపట్టాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ సంబరాల పేరిట లక్షలాది రూపాయల ఖర్చు చేశారని, వెంటనే విచారణ చేపట్టాలన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు వద్ద, రామచంద్రాపురంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకుల ఫోటోలతో కూడిన విద్యుత్ తెరలను ఏర్పాటు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారన్నారు. అయినప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు హబీబ్ జానీ, జిల్లా కన్వీనర్ వాజిద్, నాయకులు కిషన్, కాంగ్రెస్ పట్టణ నాయకులు రామారావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

కల్హేర్(నారాయణఖేడ్): ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్, ఖాజపూర్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి

ఝరాసంగం(జహీరాబాద్): ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేసి, వసతులు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మునిపల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహకు ఓటు వేయలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని హైద్లాపూర్, బుస్సారెడ్డిపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాముశెట్టి, సంగమేశ్వర్, విర్‌శెట్టి, జగన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

త్రిష ఆధ్వర్యంలో..

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని రాంసానిపల్లి తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ సీనియర్ మహిళా నాయకురాలు త్రిష ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



బుస్సారెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమష్టిగా ముందుకెళ్తే విజయం తథ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సమష్టిగా ముందుకెళ్తే విజయం తథ్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లిలో బుధవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీగా ఓట్లను రాబట్టాలని సూచనలు చేశారు. బీఆర్ఎస్ మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బేధాభిప్రాయాలు లేకుండా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తూ పార్టీ గెలుపుకోసం సైనికులుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ రాంసింగ్, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు కాల్వ అంజిరెడ్డి పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. అండగా ఉంటా

- విద్యార్థి రాజకీయ పార్టీ
- ఎమ్మెల్యే అభ్యర్థి నవోదయ సిద్ధు

జహీరాబాద్: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటానని విద్యార్థి రాజకీయ పార్టీ జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి నవోదయసిద్ధు విమర్శించారు. జహీరాబాద్‌లో ఆ పార్టీ సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య అధికంగా పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు, యువకులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం నేర్పేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. అన్ని యూనివర్శిటీల విద్యార్థి సంఘాల నాయకులు తనను జహీరాబాద్ అభ్యర్థిగా ఖరారు చేశారని తెలిపారు. తన గెలుపునకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దిలీప్, విజయ్, యోహాన్, వికాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు



బీఆర్ఎస్‌లో చేరినవారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్

- జగ్గారెడ్డికి ఓటు అడిగే హక్కులేదు
- టీఎస్ ఎంబీడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ హామీలను నమ్మొద్దని టీఎస్ ఎంబీడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్‌లో కాంగ్రెస్ నుంచి నాయకులు, కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అనునిత్యం తోడుండేది చింతా ప్రభాకర్ మాత్రమేనని, గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ సంగారెడ్డి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ కుడిలా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, సర్పంచ్ భాగ్యవతి, టీఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు రాజేందర్, రాజుగౌడ్, రాములు, శంషోద్దీన్, నాయకులు పాండురంగం, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, పవన్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని గడక్‌తండాకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గిరిజనులను ఓటు బ్యాంక్‌గానే చూశాయని, వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తండాల పరిస్థితులను చూసిన సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే 500 జనాభా కలిగిన తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారని వివరించారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్మన్ తనీ్వర్, నాయకులు సురేష్, దాను, ప్రతాప్, భాస్కర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ కార్యకర్తల చేరిక

జహీరాబాద్: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మంత్రిని కలిసిన కార్పొరేటర్ దంపతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్ దంపతులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపినట్టు చెప్పారు. అమ్మవారి దయతో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

◆ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు పాల్గొన్నారు.

◆ మద్యం విక్రయిస్తే చర్యలు

రాయికోడ్(అందోల్): గ్రామాల్లో బెల్టుషాపులు, దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా శాంతిభద్రత పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించనివారిపై చర్యలు తప్పవన్నారు.

◆ నియామకం

నారాయణఖేడ్: ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన అల్కారి సత్యనారాయణ ముదిరాజ్ నియమితులయ్యారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టప్పకుమార్ ముదిరాజ్ ఈ మేరకు నియామకపు ఉత్తర్వులను జారీచేశారు. ఈ సందర్భంగా అల్కారి సత్యనారాయణ మాట్లాడుతూ తనను నియమించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు టప్పకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ మంత్రి హరీశ్‌రావును కలిసిన జెడ్పీటీసీ

మునిపల్లి(అందోల్): జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం మంత్రి హరీశ్‌రావును కలిశారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ చంద్రన్న, రాయికోడ్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నారాయణ, పలువురు నాయకులు ఉన్నారు.

◆ ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసిన షేక్ ఫరీద్

జహీరాబాద్: పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్‌ను డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా పండుగను పురస్కరించుకొని ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు షేక్‌ఫరీద్ తెలిపారు.

◆ చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం...రామచంద్రాపురం పరిధిలోని కాకతీయనగర్ కాలనీకి చెందిన రాజేష్(21) బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 23న స్నేహితులతో కలిసి రావణ దహనం చూసేందుకు బీరంగూడ గుట్టపైకి వచ్చాడు. అయితే రావణ దహనం సందర్భంగా టపాసులు కాల్చుతున్న క్రమంలో ఒకటి వచ్చి రాజేష్ తలకు తగిలింది. దీంతో రాజేష్‌ను చికిత్స నిమిత్తం బీరంగూడ కమాన్ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడు తండ్రి కామిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ ఘనంగా దుర్గామాత నిమజ్జనం

సంగారెడ్డి: దేవీనవరాత్రుల్లో భాగంగా దుర్గామాత ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలు, పట్టణాల్లోని చెరువుల్లో దుర్గామాతను నిమజ్జనం చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వట్‌పల్లిలో..

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో దేవీశరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రాత్రి అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

ఝరాసంగంలో..

విజయదశమి పండుగను పుస్కరించుకుని నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

◆ కేతకి ఆలయ మాజీ చైర్మన్ మృతి

ఝరాసంగం(జహీరాబాద్): అనారోగ్యంతో కేతకి సంగమేశ్వర ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బస్వరాజ్ పాటిల్ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందగా బుధవారం ఝరాసంగంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ పాల్గొన్నారు.

◆ పాతకక్షలతో దాడి వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో పాతకక్షలతో మొగులయ్య (42)పై అదే గ్రామానికి చెందిన బాబు దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో డ్వాక్రా గ్రూపు చీటీల డబ్బు విషయంలో అదే గ్రామానికి చెందిన బాబు మొగులయ్యపై దాడి చేయడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు బాబుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ బెల్ట్‌షాపులను నిర్వహిస్తే చర్యలు

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌కు బీహార్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన అరవింద్ కుమార్ హోటల్‌లో మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో హోటల్‌పై దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకొని మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

◆ నియామకం

నారాయణఖేడ్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు సాయిరాం నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ నియామక ఉత్తర్వులను బుధవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జస్‌వాడే సంగప్ప, జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.